
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు


దేవునికడప మాడ వీధులలో రథంపై ఊరేగుతున్న కడప రాయుడు

వేడుకగా రథోత్సవం

- దేవుని కడపకు పోటెత్తిన భక్త జనం
- దారి సరిగా లేక ట్రాఫిక్ జామ్
- ఇబ్బంది పడ్డ భక్తులు


రథంలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 16: తిరుమలకు తొలిగడపగా దేవుని కడపలో కొలువుదీరిన వేంకటేశ్వరుని రథోత్సవం వేడుకగా సాగింది. లక్ష్మీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా విచ్చేసిన భక్తజనులను కటాక్షిస్తూ, తేజోరూపుడు వేంకటేశ్వరుడు రథంపై ఊరేగాడు. స్వామిని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. ఏడుకొండలవాడా... గోవిందా గోవిందా నామస్మరణతో దేవునికడప మారుమోగింది. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో శ్రీవారి రథాన్ని అందంగా ముస్తాబుచేశారు. మధ్యాహ్నం 2 గంటలకు దేవుని కడప యువత భక్తజనంతో కలిసి రథాన్ని కదిలించారు. ఆ జగన్నాధుని స్మరిస్తూ ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్, క్రిష్ణమోహన్ వేద మంత్రాలు జపించగా, మరోవైపు సంగీతజ్ఞుల సుస్వరాలు, భక్తజనం కోలాహలంతో స్వామివారి రథం అత్యంత శోభాయమానంగా ముందుకు సాగింది. స్వామివారి రథాన్ని తాకడమే భాగ్యంగా భక్తులు భావించగా, యువతీ, యువకులు రథంపైకి ఎక్కడానికి ఉత్సాహం చూపారు. మాడ వీధుల్లో స్వామివారు వస్తుంటే ఆ ప్రాంత నివాసులు రథానికి ఆహ్వానం పలుకుతూ కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ధూళి ఉత్సవం నిర్వహించారు. తదుపరి అన్నమయ్య కీర్తనలు, కోలాటాలు, హరికథ గానాలు నిర్వహించి భక్తులకు వీనులవిందు గావించారు. రథోత్సవంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు.

భక్తులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు

కడప నగరంలోని దేవుని కడప రోడ్డు వెడల్పు, సర్కిల్స్ సుందరీకరణ పనులు పూర్తికాకపోవడంతో రథోత్సవానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్రిష్ణా సర్కిల్ నుంచి ఆలయానికి వెళ్లేమార్గం భక్తజనంతో కిక్కిరిసింది. స్వామి వారి దర్శనానికి వెళ్లే వాహనాలు ఎక్కువ కావడం.. ఆ మార్గం వెంబడి దారికి ఇరువైపులా రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ కాల్వలు, సర్కిల్స్ మరమ్మతుల కారణంగా ట్రాఫిక్‌జాం అయింది. పోలీసులు వాహనాల క్రమబద్ధీకరణ చేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఒకానొక దశలో శ్రీవారిని దర్శించుకోవడం భక్తుల సహనానికి పరీక్షగా మారినట్లయింది. పలువురు భక్తులు లోలోల పాలక ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బహిరంగంగా విమర్శిస్తూ ముందుకు కదిలారు.

రైతులను లాభాల బాటలో నడిపించాలి : జేసీ

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: వ్యవసాయ అనుబంధ రంగాలను పటిష్టం చేసి రైతులను లాభాల బాటలో నడిపించాలని జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగం లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్లో సాధారణ సాగు విస్తీర్ణం 1.49 లక్షల హెక్టార్లకు గాను 1.12 లక్షల హెక్టార్లలో సాగు జరిగిందన్నారు. ఆర్బీకేల పరిధిలో వ్యవసాయ సహాయకులు సీజన్ల వారీగా పండించే పంటలు, వాటికి ఆశించే తెగుళ్ల గురించి అవగాహన కల్పించాలన్నారు.

బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్ష

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకం 9వ విడతకు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో డీఆర్డీఏ, మెప్మా, బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్నతోడు రుణ లక్ష్యాన్ని అందుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. 9వ విడతలో 10,290 మంది చిరువ్యాపారులకు రూ.10.29 కోట్లు రుణ లక్ష్యాన్ని నిర్దేశించామని ఈ మేరకు బ్యాంకులు సహకరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం విశ్వకర్మ పథకం అమలుపై డీఆర్డీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడుగా ఉన్న ఎం.లింగారెడ్డిని రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాజకీయ వేడి

- 'ఆపరేషన్ ఆకర్ష్'తో టీడీపీలో జోష్
- రోజూ చేరికలే
- బద్వేలు, జమ్మలమడుగు అసంతృప్తి నేతలతో ఎంపీ చర్చలు
- పార్టీ వీడొద్దంటూ మంతనాలు



(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమరానికి సమయం దగ్గర పడే కొద్దీ జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూలు వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేసవికి ముందే జిల్లాలో రాజకీయం వేడెక్కింది. సీఎం సొంత జిల్లాలో వరుస చేరికలతో టీడీపీ మంచి జోష్‌లో ఉంది. ఇక పార్టీ వీడొద్దంటూ వైసీపీ సొంత కేడర్‌ను బుజ్జగించి వారికి తాయిలాలు ప్రకటిస్తోంది. ఒకటి రెండుచోట్ల మినహా ఇరుపార్టీలు అభ్యర్థులను దాదాపు ప్రకటించినట్టే. ఎన్నికల సంగ్రామానికి గడువు దగ్గర పడే కొద్దీ రాజకీయవేడి పెరుగుతోంది. వైసీపీలో అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి రంగంలోకి దిగారు. బద్వేలు, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో అసంతృప్తి నేతలతో ఆయనే నేరుగా కలవడం గమనార్హం.

టీడీపీలో జోష్

సీఎం జగన్ సొంత జిల్లాలో పూర్వ వైభవం కోసం టీడీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. జనంలో ఉన్న అసంతృప్తిని ఓటుగా మార్చుకోవడంలో భాగంగా ఆచితూచి వ్యవహరిస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరిట దాదాపు మూడు మాసాలుగా టీడీపీలో జనాల్లోనే ఉంది. ఇంటింటికీ వెళుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని రెండు నెలల కిందటే మొదలు పెట్టినట్లయింది. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలు ముమ్మరంగా తిరుగుతూ జనంతో మమేకమవుతున్నారు. టికెట్ ఆశించే వారి సంఖ్య ఎక్కువగా ఉండే చోట ప్రచారం మరింత జోరుగా ఉంది. ఇక ప్రతి చోటా వైసీపీ నేతలను టీడీపీలోకి తెచ్చుకుంటున్నారు.

బద్వేలులో వైసీపీకి గండి

బద్వేలులో తిరిగి పూర్వ వైభవం కోసం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆమె కుమారుడు రితీశ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. 2004కు ముందు బద్వేలు టీడీపీకి అడ్డాగా ఉండేది. అలాంటిది 20 ఏళ్లగా టీడీపీ గెలుపునకు నోచుకోలేదు. ఈ సారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే రితీశ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేశారు. ఇక్కడ వైసీపీ నుంచి రోజూ పెద్దఎత్తున చేరికలు ఉంటున్నాయి. రెండురోజుల క్రితం కలసపాడు మాజీ జడ్పీటీసీ దాదన భూపాల్‌రెడ్డి తన వర్గీయులతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ చైర్మన్ సింగసాని గురుమోహన్ సోదరులు గురురాజా, బుజ్జీలు విజయమ్మ, రితీశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బద్వేలు నియోజకవర్గంలో గురుమోహన్ కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈయన తండ్రి పరంధామయ్య వైఎస్ కుటుంబం వెంటే ఉండేవారు. ఆయన కుమారులు బుజ్జి, గురురాజా టీడీపీలో చేరడం వైసీపీకి మైనస్ అనే అంటారు. అట్లూరు మండలం ముత్తుకూరులో 150 కుటుంబాలు, కాశినాయన మండలం రెడ్డికొట్టాలులో 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఇక జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కొండాపురం మండలం సుగమంచిపల్లెలో పలువురిని టీడీపీలో చేర్చుకున్నారు. ఇక కడప, మైదుకూరు, కమలాపురం, పులివెందులలో కూడా భారీగా వైసీపీ శ్రేణులు టీడీపీలోకి వస్తున్నారు.

బుజ్జగింపుల్లో వైసీపీ

వచ్చే ఎన్నికల్లో మళ్లీ 2019 నాటి ఫలితాలే పునరావృత్తం అవుతాయని మొన్నటిదాకా వైసీపీ నేతలు ధీమాగా ఉండేవారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి గమనించిన గ్రామ, మండల స్థాయి నాయకులు మెల్లమెల్లగా టీడీపీలోకి జంప్ అవుతున్నారు. పల్లెల్లో అభివృద్ధి పనులు ఇతరత్రా వాటిల్లో వైసీపీలో కొందరికే ప్రాధాన్యత ఉండడంతో మిగిలిన వారు అసంతృప్తిగా ఉన్నారు. దీన్ని గమనించి బుజ్జగింపులకు శ్రీకారం చుట్టినట్లు చెబుతారు. కొందరికి తాయిలాలు, కొందరికి పనులు ఇచ్చి బుజ్జగించినట్లు చెబుతున్నారు. పులివెందులలో ఇప్పటికే ఈ తరహా బుజ్జగింపులు పూర్తయినట్లు చెబుతారు. జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గీయులు ఇప్పటిదాకా ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జ భూపేశ్‌రెడ్డి నిత్యం జనాల్లో ఉంటున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య గ్యాప్ బాగా పెరగడంతో రామసుబ్బారెడ్డి వర్గీయులు టీడీపీ గూటికి చేరుతున్నారు. వారం క్రితం మేయర్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డితో చర్చలు జరిపారని సమాచారం. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు మరోసారి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డితో చర్చలు జరిపి వీరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇందులో భాగంగా శుక్రవారం మైలవరం మండలంలో ముగ్గురు కలిసి పర్యటించారు. నవాబుపేట, దుగ్గనపల్లె, గొల్లపల్లె, వద్దిరాల, నక్కవానిపల్లె, దొడియం, దాసరిపల్లెలో పర్యటించి రామసుబ్బారెడ్డి వర్గీయులతో మంతనాలు జరిపి టీడీపీ వైపు వెళ్లకుండా ఉండేందుకు బుజ్జగించినట్లు సమాచారం. కొందరు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గీయులకే వైసీపీలో చేరినట్లు కండువాలు వేశారని అంటారు. ఇక బద్వేలులో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, కాశినాయన మాజీ మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డిల మధ్య వర్గపోరు తీవ్రంగా ఉండేది. ఎమ్మెల్సీకి వ్యతిరేకంగా విశ్వనాథరెడ్డి పలు సమావేశాలు నిర్వహించారు. దీంతో ఎంపీ, మేయర్ కలసి విశ్వనాథరెడ్డిని సీఎం జగన్ వద్దకు తీసుకెళ్లి బుజ్జగించారంటారు. ఇందులో భాగంగానే గురువారం పోరుమామిళ్లలో సమావేశానికి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధ, జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు కలసి విశ్వనాథరెడ్డి వర్గీయులతో సమావేశం నిర్వహించి బుజ్జగించారని చెబుతారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను టీడీపీ వివరిస్తూ సూపర్ సిక్స్ పథకాన్ని జనాల్లోకి తీసుకెళుతూ చేరికలతో జోష్‌లో ఉంది. జెడ్ స్పీడ్‌తో టీడీపీలోకి దూకుతున్న సొంత కేడరును కాపాడుకునేందుకు వైసీపీ నానాపాట్లు పడుతుండడంతో జిల్లాలో రాజకీయం బాగా వేడెక్కింది.


బద్వేలులో విజయమ్మ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరిన గురుమోహన్ సోదరులు సింగసాని గురురాజా, బుజ్జి తదితరులు


పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి వ్యతిరేక వర్గంతో గురువారం సమావేశమైన ఎంపీ అవినాశ్‌రెడ్డి

వైసీపీ నుంచి వైసీపీలోకి..!

ఎన్నికల సమయంలో ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు ఉండటం సహజం. కానీ ఐదేళ్లుగా రివర్స్ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్ పార్టీలో వ్యవహారమే వేరు.. ఇక్కడ వైసీపీ నుంచి వైసీపీలోకే చేరడం విశేషం. శుక్రవారం మైలవరం మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పర్యటించి ఎమ్మెల్సీ వర్గీయులతో మంతనాలు జరిపారు. వీరు టీడీపీలో చేరేందుకు జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు వారిని బుజ్జగించి వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వైసీపీ వారికి వైసీపీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిచడం చూసి అక్కడకు వచ్చిన వారంతా ముక్కున వేలేసుకున్నారు.

- మైలవరం


వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గానికి చెందిన వారికి వైసీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దేవుని భూములకే ఎసరు పెట్టడం దుర్మార్గం

- రాచమల్లు భూదాహంపై పెల్లుబికిన ఆగ్రహం
- వరద నేతృత్వంలో ఫ్లెక్సీ బ్యానర్లతో ర్యాలీ, ధర్నా

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 16: ప్రొద్దుటూరులో ఏకంగా దేవుని భూములకే రాచమల్లు ఎసరు పెట్టడం దుర్మార్గపు చర్య అని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి భూదాహంపై జనంలో ఆగ్రహం పెల్లుబికింది. ఆలయ భూముల ఆక్రమణను వ్యతిరేకిస్తూ శుక్రవారం టీడీపీ కార్యకర్తలు వరదరాజులరెడ్డి నేతృత్వంలో పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద నుంచి గాంధీరోడ్డు, విజయకుమార్ సర్కిల్, జమ్మలమడుగు రోడ్డు, రాజీవ్ సర్కిల్, శివాలయం వీధి పుట్టపర్తి సర్కిల్ నుంచి తహసీల్దారు కార్యాయలం వరకు ఫ్లెక్సీ బ్యానర్లతో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో రాచమల్లు భూదాహం నశించాలి.. దేవుని భూములు కాపాడాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నాలో వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను, దేవాలయం భూములను పరిరక్షించాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే రాచమల్లుప్రసాద్‌రెడ్డి ఏ హక్కుతో దేవుని భూములను చదును చేసి రోడ్లు వేశాడన్నారు. దేవదాయ శాఖ అనుమతులు ఇవ్వకున్నా, ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయకున్నా ఆ భూములలో నీవు దిగి పనులు చేయడం చట్టవ్యతిరేకం అన్నారు. ఇది భూకబ్జా కాకుండా మరేమవుతుందో చెప్పాలన్నారు. ఎమ్మెల్యే అయివుండి ఇలాంటి పనులు చేయవచ్చా అని నిలదీశారు. పైగా తన చర్యలను సమర్థించుకుంటూ తమ ధర్నాకు ముందే ఎమ్మెల్యే రాచమల్లు ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టారన్నారు. ఆలయానికి చెందిన వ్యవసాయ భూముల్లో మట్టి వ్యర్థాలు వేసి ప్లాట్లుగా మార్చడానికి చదును చేస్తే ఆభూములను దేవాదాయ శాఖ ఎలా లీజుకు ఇస్తుందని ప్రశ్నించారు. ఆ భూములు వ్యవసాయ యోగ్యం కాకుండా చేసి వాటిని ఆక్రమించుకోవాలనే ఈ తరహా చర్యలకు పాల్పడి రోడ్లు సైతం నిర్మించారన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి జగన్ అండతోనే సాగుతోందన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పట్టపగలు హత్యలు చేయడం ఆఖరికి బాడీలు డోర్‌డెలివరీ కూడా చేస్తున్నారన్నారు. అందులో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు అగ్రస్థానంలో ఉన్నారన్నారు. వరద తనయుడు కొండారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు ప్రొద్దుటూరు ప్రజల పాలిట రాచముల్లుగా మారాడన్నారు. రాచముల్లును ప్రొద్దుటూరు రాజకీయాలనుంచి తొలగించడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు. వారం క్రితమే తాము ఎండోమెంట్ అధికారులకు దేవుని భూముల్లో ఎమ్మెల్యే రాచమల్లు పనులు చేస్తున్నాడని ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తెచ్చినా వారు పట్టించుకోకపోవడంతో ఏకంగా రోడ్ల నిర్మాణం కూడా జరిగిందన్నారు. రాచమల్లు భూదాహం ప్రజల దృష్టికి తెచ్చి దేవుని భూములు కాపాడాలనే ఈ ఆందోళన చేపట్టామన్నారు. పట్టణంలో రాచమల్లు భూదాహంపై ఫ్లెక్సీలు వేస్తే వెంటనే పోలీసులు, మున్సిపల్ అధికారులు వాటిని తొలగించారన్నారు. ఆలయ భూముల్లో రోడ్లు తొలగించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు మనోహర్‌రెడ్డి, చెన్నకేశవస్వామి ఆలయ ఈవో జగన్‌మోహన్‌రెడ్డి శిబిరం వద్దకు వచ్చి వారితో చర్చించారు. వారం లోపు రోడ్డు తొలగించి దానిని బ్లాక్ చేస్తామని, దేవుని మాన్యం అని బోర్డు నాటుతామని ఈవో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు , మాజీ జడ్పీటీసీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా ధర్నా జరగడానికి ముందే రాచమల్లు మీడియాతో మాట్లాడుతూ తాను భూదందా చేయలేదని, ప్రజల సౌకర్యం కోసం చదును చేసి రోడ్లు వేశానని అన్నారు.


రాచమల్లు భూదాహంపై వరదరాజులరెడ్డి అధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

త్వరలో అధికారంలోకి టీడీపీ-జనసేన

- ప్రజలందరికీ మంచి రోజులు రానున్నాయి
- తుంగా రమణయ్య జన్మదిన వేడుకలలో నేతలు


కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 16: రాష్ట్రంలో ఐదేళ్లుగా సాగుతున్న వైసీపీ అరాచకపాలనకు ప్రజలు చరమగీతం పలకనున్నారని, త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ-జనసేన పార్టీల సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు కానుందని పలువురు టీడీపీ, జనసేన నేతలు పేర్కొన్నారు. ఇటీవల జనసేన పార్టీలో చేరిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తుంగా రమణయ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ మలిశెట్టి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ రాజకీయరంగంలోకి తుంగా రమణయ్య ప్రజల ఆశీర్వాద బలంతో, మిత్రుల సహకారంతో రాజకీయ రంగానికే వన్నెతెచ్చేలా మచ్చలేని నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. తుంగా రమణయ్య మాట్లాడుతూ మెగాస్టార్ ఫ్యామిలీ అంటే తనకు ప్రాణమని, అందుకే జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నానన్నారు. వైసీపీ అరాచకాలను నిగ్గదీసి అడుగుతున్న పవన్‌కళ్యాణ్ కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో జనసేన రాయలసీమ జోన్-1 కోకన్వీనర్ పంద్ర రంజిత్‌కుమార్, రాజంపేట జనసేన నాయకులు ఎలక్ట్రికల్ శ్రీనివాసరాజు, నగర అధ్యక్షుడు మాలె శివ, రాజ్ ఇంటీరియర్స్ అధినేత కె.రాజేశ్‌కుమార్, శ్రీహరి ఐరన్‌మార్ట్ అధినేత వడ్ల శ్రీనివాస్, రామ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత నరసింహులు, రియల్టర్ జల్లా సుబ్రమణ్యం, విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ డైరెక్టర్ తుంగా వెంకటేశ్, తుంగా కిరణ్, శ్రీనివాస రెసిడెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ బీవీ సుమన్, చైర్మన్ బి.శ్రీనివాసులు, శంకరాపురం సుబ్బారావు, టింబర్ గోపి, టింబర్ సుబ్బయ్య, డైమండ్ బాలకృష్ణ, అంజి, హర్షవర్ధన్, అమరప్ప లెవన్‌నాట్‌ఫోర్ రమణ, తోట సుమన్, న్యాయవాది గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



తుంగా రమణయ్యను సన్మానిస్తున్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ.. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

బర్డ్‌ఫ్లూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడప(రూరల్), ఫిబ్రవరి 16: నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలో బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ అయిందని, అందువలన జిల్లాలోని కోళ్ల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి శారదమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 10,95150 కోళ్ల ఫారాలలో ఉన్నాయన్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవిస్తే స్థానిక పశువైద్యాధికారుల దృష్టికి తేవాలన్నారు.


చిన్నపోతుల ప్రాజెక్టు

హామీలన్నీ నీటిమూటలేనా..!

● శిథిలావస్థలో చిన్నపోతుల ప్రాజెక్టు
● ఎన్నికలకు ముందే లక్కిరెడ్డిపల్లెకు సాగునీరు అందిస్తామన్న ప్రభుత్వం
● 5 ఏళ్లలో ప్రాజెక్టుల సంగతే మరిచారు...
● రెండు నెలల్లో 400 క్యూసెక్కుల నీరు అందేనా?

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16: తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు సాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయి. అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లవుతున్నా వైసీపీ ప్రభుత్వం వాటిని మరిచిందని ఇక్కడి ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గండికోట ప్రాజెక్టు నుంచి కెనాల్ ఏర్పాటు చేసి కడప, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందిస్తామని అది కూడా 2024 ఎన్నికలకు ముందే అన్ని మండలాలకు సాగునీరు అందించి ఎన్నికలకు వెళతామని ఆ ప్రభుత్వం 2019లో తెలిపింది. ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఒక్క చిన్న పని కూడా చేయలేదు. ఇక ఎన్నికలు రెండు నెలల్లోపే జరగనున్నాయి. ఈ కొద్దిరోజుల్లోనే శిథిలావస్థలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయ్యేది ఎన్నడోనని ప్రజలు, రైతులు అంటున్నారు. గండికోట ప్రాజెక్టు నీటిని కెనాల్ ద్వారా చక్రాయపేట మండలం కాలేటివాగు ప్రాజెక్టుకు నింపి 400 క్యూసెక్కుల నీటిని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రస్తుతం చక్రాయపేట కాలేటివాగు ప్రాజెక్టు నుంచి పనులు ప్రారంభించి లక్కిరెడ్డిపల్లె వరకు పైపులైను పనులు మాత్రమే చేశారు. అయితే లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు కాలేటివాగు ప్రాజెక్టు నుంచి నీరు తెచ్చి ఈ రెండు మండలాల్లోని 44 చెరువులకు మరమ్మతులు చేసి సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. చక్రాయపేట మండలం నుంచి లక్కిరెడ్డిపల్లె మండలంలోని చంచర్లపల్లె మొరుగుల చెరువుకు 400 క్యూసెక్కుల నీటిని చిన్నపోతుల ప్రాజెక్టుకు నింపి అందులో నుంచి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మండలంలోని అన్ని చెరువులకు నీరు నింపాలన్నది లక్ష్యం. అయితే మండలంలో ఇంతవరకు కాలువ పనులు గాని, పైపులైను పనులు కానీ ప్రారంభించలేదు. దీనికి తోడు 44 చెరువుల్లోని 20 చెరువులు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేసి నీటిని ఎప్పుడు నింపుతారో తెలియడం లేదు. అంతేకాకుండా కాలువల నిర్మాణానికి, పైపులు వేయడానికి రెండు మండలాల్లోని రైతుల వద్ద నుంచి ప్రభుత్వం భూములు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇదంతా ఎప్పుడు జరుగుతుందో తెలియడం లేదు. చిన్నపోతుల ప్రాజెక్టు కాలువల ద్వారా రామరాజువంకకు, దిన్నెపాడు చెరువు, కల్పనాయుని చెరువులకు నీరు అందించాల్సి ఉంది. ఏదేమైనా ప్రభుత్వం రెండు నెలల్లో కోట్ల రూపాయల పనులు చేసి ఈ రెండు మండలాలకు కాలేటివాగు నీరు అందించడం సాధ్యమయ్యే పని కాదని, ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే కానీ చేతల్లో ఏదీ చూపడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.


అధ్వానంగా ఉన్న ప్రాజెక్టు కాలువ


కూలిపోయిన కుడి, ఎడమ కాలువలు

30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు..



1990లో చిన్నపోతుల ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ రెడ్డెప్ప ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాలువలు ఏర్పాటు చేశారు. దీంతో వందల ఎకరాలకు సాగునీరు అందేవి. పాళెం, గొల్లపల్లె, మామిడిగారిపల్లె, చంచర్లపల్లె, బి.ఎర్రగుడి గ్రామాలకు సాగునీరు అందేవి. ప్రస్తుతం కాలేటివాగు నుంచి నీటిని అందిస్తామన్నారు. ఇంతవరకు ఎక్కడేకాని పనులు మొదలు పెట్టలేదు. ఇంక నీళ్లు ఎప్పుడు ఇస్తారు.

- నాగమల్లయ్య, రైతు, చిన్నపోతులపల్లె

పట్టించుకునే నాథుడే లేడు..



చిన్నపోతుల ప్రాజెక్టు నిర్మించి 30 సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు మరమ్మతులకు నోచుకోలేదు. శేషాచల అడవుల్లో పడ్డ వర్షపు నీరు ప్రాజెక్టుకు చేరుకుంటుంది. అయితే చుక్కనీరు నిల్వ ఉండదు. ఎందుకంటే కాలువ, తూములు శిథిలావస్థలో ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేస్తే నాలుగు పంచాయతీల్లోని 1100 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

- రెడ్డెయ్య, రైతు, చిన్నపోతులపల్లె

వైభవంగా కోదండరాముని గ్రామోత్సవం


భక్తులకు దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 16: ఏకశిలానగరి కోదండ రామాలయంలో రథసప్తమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రథసప్తమి పురస్కరించుకొని వేకువజాము నుంచి టీటీడీ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం సూర్యవాహన అలంకారంలో సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పురవీధుల గుండా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారికి పెద్ద ఎత్తున మహిళలు కాయ, కర్పూరం సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై సౌమ్యనాథుడు


ఉదయం సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు

నందలూరు, ఫిబ్రవరి 16: నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో రథసప్తమి పురస్కరించుకొని శుక్రవారం ఉదయం స్వామివారు కూర్మాలంకారంలో, రాత్రి కృష్ణ భగవానుని అలంకారంలో సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం


ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు

నందలూరు, ఫిబ్రవరి 16: ఆడపూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దిగువ దళితవాడలో సీతారాముల ఆలయ నిర్మాణానికి గడికోట సుబ్బారెడ్డి (జేసీబీ సుబ్బారెడ్డి), జడ్పీటీసీ సభ్యురాలు గడికోట ఉషారాణి దంపతులు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఆలయంలో సీతారామ లక్ష్మణ హనుమంతుల వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని గోవిందనామ స్మరణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు.

బాసట హోంకు రూ.50 వేలు వితరణ


నగదును అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ హర్షిత్

కడప(ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 16: కడప నగరం బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాసట చిల్డ్రన్స్ హోంకు ఎన్‌ఆర్‌ఐకి చెందిన వై.హర్షిత్ రూ.50వేలు వితరణ చేశారు. హౌసింగ్ బోర్డుకాలనీ కోదండ రామాలయ ధర్మకర్త వెంకటరెడ్డి ద్వారా ఆయన చిల్డ్రన్స్ హోం గురించి తెలుసుకుని తన తల్లిదండ్రులైన మంజుల, మనోహర్‌రెడ్డి పేరు మీద హోం నిర్వాహకులైన ఎం.బాలాజీ, కార్తీక్‌రెడ్డిలకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.

యూసీఐఎల్ టెయిలింగ్ పాండ్ పైప్‌లైన్ లీకేజీ

● పంట పొలాల్లోకి యురేనియం వ్యర్థాలు
● రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందని ఎక్సకవేటర్‌తో పనులు


వ్యర్థాలు కనిపించకుండా ఎక్సకవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

పులివెందుల, ఫిబ్రవరి 16: వ్యర్థాల నిల్వలో యూసీఐఎల్ మరోసారి నిర్లక్ష్యం ఆవహించింది. నాలుగు రోజులుగా యూసీఐఎల్‌లో భద్రతావారోత్సవాలు సాగుతున్న సమయంలోనే టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్ లైన్ లీకేజీ కావడం కలకలం రేపుతోంది. వివరాలిలా..

పులివెందుల నియోజకవర్గం ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారుతోంది. అటు వాతావరణానికి, ఇటు మానవాళికి ముప్పుగా ఉండే యురేనియం వ్యర్థాల విషయంలో యూసీఐఎల్ నిర్లక్ష్యం వహిస్తూనే ఉందని సర్వత్రా విమర్శలు ఉన్నాయి. యురేనియం వ్యర్థాలను నిల్వ చేసే టెయిలింగ్ పాండ్‌ను యూసీఐఎల్ సదా పర్యవేక్షిస్తూ ఉండాలి. కానీ ఇక్కడ పదేపదే పైప్‌లైన్ లీకేజీలు కావడం పరిపాటిగా మారుతోంది. అందులో భాగంగా గురువారం యూసీఐఎల్ నుంచి టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్‌లైన్ లీకేజీ అయింది. దాదాపు 12 నుంచి 15గంటల పాటు వ్యర్థాలు పొలాల్లోకి ప్రవహించాయి. దీనిని గమనించిన కొందరు రైతులు యూసీఐఎల్ అధికారులుకు తెలియజేశారు. అధికారులు అప్రమత్తమై శుక్రవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి లీకేజీ అయిన యురేనియం వ్యర్థాలు బయటకు కనిపించకుండా ఎక్సకవేటర్ సాయంతో ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు. ఆ వ్యర్థాలు మనుషులు, పశువులకు తాకితే చర్మం పూర్తిగా ఊడిపోతుందని సమాచారం. ఇలాంటి ప్రమాదం జరుగుతుందేమో అనే ఆందోళనతో యూసీఐఎల్ అప్పటికప్పుడు ఎక్సకవేటర్ సాయంతో చదును చేయించింది. ఈ పనులను కేకేకొట్టాల వాసులు కొందరు ఫొటోలు తీస్తుంటే యూసీఐఎల్ సిబ్బంది వారిని అడ్డుకొని అక్కడి నుంచి పంపించారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి చేరవేశారు. దీనిపై యూసీఐఎల్ అధికారులను ఫోన్‌లో వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.


కేకే కొట్టాల సమీపంలో లీకైన యూసీఐఎల్ వ్యర్థాలు

కాగా.. నాలుగు రోజులుగా యూసీఐఎల్‌లో భద్రతా వారోత్సవాలు సాగుతున్నాయి. భద్రతా వారోత్సవాలు సాగుతున్న సమయంలోనే యూసీఐఎల్ నిర్వహణలో లోపాలు బయటపడడం ఎంతో దారుణం. యూసీఐఎల్‌లో ప్రధానంగా టెయిలింగ్ పాండ్ భద్రత ఎంతో ముఖ్యం. కానీ టెయిలింగ్ వ్యవహారాన్ని యూసీఐఎల్ గాలికి వదిలేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. టెయిలింగ్ పాండ్‌తోనే తమ పంటలు, మనుషుల ఆరోగ్యాలు, పశుసంపద పూర్తిగా నాశనం అవుతున్నాయని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు సరుడు అపహరణ


సంఘటనా స్థలంలో విచారిస్తున్న ఎస్ఐ రుషికేశవ రెడ్డి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 16: నగర పంచాయతీ పరిధిలోని అడ్డరోడ్డు సమీంలో పట్టపగలు వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన శుక్రవారం కమలాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రుషికేశవరెడ్డి సమాచారం మేరకు... క్రాస్ రోడ్డు వద్ద పెద్దచెప్పలి రోడ్డులో మీగడ గంగమ్మ నివాసం ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటలకు తన ఇంటి ముందు మంచంపై కూర్చుని ఉండగా అదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి సుమారు 3 తులాల బంగారు చైన్‌ను లాక్కుని పారిపోయినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఆ ఫిర్యాదు మేరకు కమలాపురం పోలీసులు విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

● తహసీల్దారు కార్యాలయం ఎదుట జేఏసీ నిరసన



నిరసన తెలుపుతున్న ఏపీ జేఏసీ ఉద్యోగులు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లలో భాగంగా మధ్యంతర భృతిబ(ఐఆర్) 30 శాతం ప్రకటించాలని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, కన్వీనరు డి.రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల కార్యచరణ ఐక్య సమితి(జేఏసీ) పిలుపు మేరకు మూడవ రోజైన శుక్రవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి కడప తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీని అమలు చేయాలని, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, డీఏ, అరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నగదు రహిత వైద్యం అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 17న కలెక్టరేట్, 20న జిల్లాలో ర్యాలీలు, ధర్నాలు చేస్తామని, 27న చలో విజయవాడలో ర్యాలీ, ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నిత్యపూజయ్య, బ్రహ్మానందరెడ్డి, బాలపుల్లయ్య, వాసన్, నరేంద్ర, చిన్నయ్య, శైలేశ్వరరెడ్డి, పద్మనాభం, మోహన్‌రెడ్డి, కాటమయ్య, శ్రీనివాసులు, బాలయ్య, భూషణం, రాధాకృష్ణ, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16: ఉద్యోగులకు ప్రభుత్వం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) పిలుపు మేరకు శుక్రవారం భోజన విరామ సమయంలో మూడవ రోజు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, రాయచోటి జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుంచి ఉద్యోగులకు రావాల్సిన ఐఆర్ 30 శాతంతో పాటు పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే 12వ పీఆర్సీ అమలు చేయాలని, డీఏ, పీఆర్సీ అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతేగాక 11వ పీఆర్సీ అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఈహెచ్ఎస్ కింద అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నగదు రహిత వైద్యం అందించాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 20న జిల్లాలో నిరసన ర్యాలీ చేపట్టి ధర్నా, 27వ తేదీ ఛలో విజయవాడ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ యూటీఎఫ్ జాబీర్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, కార్యదర్శి ఈశ్వరయ్య, ఎన్జీవో సంఘం నేతలు మహమ్మద్‌బాషా, శ్రీనివాసులు, ప్రమీలమ్మ, దేవేంద్ర, శివారెడ్డి, జయరామయ్య, రామక్రిష్ణయాదవ్, ముద్దుకృష్ణ, మహాదేవ, శ్రీనివాసులు, వరలక్ష్మి, పార్వతి, పద్మ, రమణ, గణేశ్, రామక్రిష్ణ, రాజేశ్, నాగరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రమణ, జయచంద్రారెడ్డి, వీరనాగిరెడ్డి, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: విద్యార్థులకు ఆహ్లాదకరమైన సదుపాయాలను కల్పించడంతో పాటు విద్యాప్రమాణాలు పెంచాలని కలెక్టర్ విజయరామరాజు విద్యాలయ యాజమాన్య కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో కేంద్రీయ విద్యాలయ యాజమాన్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో చదివేలా సదుపాయాలు ఉండాలన్నారు. ఈ ఏడాది జరిగే 10, 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో కడప కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. హార్స్‌డ్రైవింగ్ శిక్షణ కూడా అందించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. తాగునీరు, విద్యుత్ దీపాలు, స్టాఫ్ క్వార్టర్స్, రోజువారీ నీటి అవసరాలకు బోర్ వెల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

మైలవరం నుంచి దక్షిణ కాలువకు నీరు విడుదల

మైలవరం, ఫిబ్రవరి 16: మైలవరం జలాశయం నుంచి దక్షిణకాలువకు రోజుకు 500 క్యూసెక్కుల నీటిని జిల్లా వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి శుక్రవారం నీటిని విడుదల చేశారు. గండికోట జలాశయం నుంచి రోజుకు 1000 క్యూసెక్కుల మేర నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో దక్షిణకాలువకు తాగు, సాగునీటి అవసరాలకోసం రోజుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 0.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది, నాయకులు మహేశ్వరరెడ్డి, విష్ణు,రామాంజనేయయాదవ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వల్లూరు, ఫిబ్రవరి 16: మండల కేంద్రమైన కడప - తాడిపత్రి కట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అయ్యావారయ్య (62) అనే వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు తన ద్విచక్ర వాహనంలో అయ్యావారయ్య తన పని మీద వెల్లటూరు వెళుతుండగా ఐచర్ వాహనం వచ్చి ఢీకొన్న సంఘటనలో తీవ్రగాయాలైనట్లు తెలిపారు. అతన్ని స్థానికులు 108లో కడప రిమ్స్‌కు తరలించగా వైద్యులు చికిత్స చేస్తుండగా గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుమారుడు భీమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత


మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ, ఎస్ఐ

వేంపల్లె, ఫిబ్రవరి 16: మండలంలోని ముతుకూరు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 102 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. అందిన సమాచారంతో ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది దాడులు చేయగా ఓ వ్యక్తి వద్ద అక్రమంగా ఉన్న మద్యం బాటిళ్లను పట్టుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- ఇరువురికి తీవ్రగాయాలు

వీరబల్లి, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని తాటికుంటపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన అన్నదమ్ముల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. నాటుసారాపై పోలీసులు నిఘా ఉంచి పై తెల్పిన గ్రామంలో విచారణ సాగించారు. ఈ క్రమంలో వీరిపల్లె వెంకటేశ్ సారా కాచుతున్నాడని ఆయన తమ్ముడు ఆంజనేయులు పోలీసులకు సమాచారం ఇచ్చాడనే నెపంతో అతనిపై, ఆయన భార్య జయమ్మలపై. వెంకటేశ్, శ్రీను, నాగవేణి, లక్ష్మీదేవిలు దాడి చేశారు. ఇనుపరాడ్లు, కొడవలితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు, ఫిబ్రవరి 16 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ ఉపాధ్యక్షుడు, కమలాపురం టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి, యువనేత క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మీ భవిష్యత్తు మేం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి టీడీపీ వస్తే అందిచే సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. అనంతరం పుత్తా మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, దీనికి చరమగీతం పాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఈ ప్రభుత్వం బడుగు బలహీనవార్గలకు ఏమీ చేయలేదన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని, తద్వారా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు జనరంజకంగా ఉంటుంద న్నారు. అంతకు ముందు ఆయన గ్రామంలోకి రాగానే గ్రామ ప్రజలు మేళతాళాలు, బాణసంచాతో పూలవర్షం కురిపించారు. వీరి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, యువనేత పుత్తా లక్ష్మీరెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఏటూరు రామచంద్రారెడ్డి, ఆదినిమ్మాయపల్లె మాజీ ఉప సర్పంచ్ రమణారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, ధూలి రవి, సుధీర్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, అంకిరెడ్డి, శివరామక్రిష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాలయ్య, సుబ్బరాయుడు, గోపాల్, యువనేత సాయినరసింహారెడి పాల్గొన్నారు.

పుత్తా ఆధ్వర్యంలో 30 కుటుంబాల టీడీపీలో చేరిక

వల్లూరు, ఫిబ్రవరి 16 : మిట్టపల్లెలో శుక్రవారం మీభవిష్యత్తుకు టీడీపీ గ్యారంటీలో భాగంగా కమలాపురం టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా ఆధ్వర్యంలో ఆదినిమ్మాయపల్లె మాజీ సర్పంచ్ నారాయణ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పుత్తా వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణారెడ్డి, దూలి రవి, హరి క్రిష్ణ, శివశంకర్‌రెడ్డి, క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, పలువురు నేతలు, ఆదినిమ్మాయపల్లె ప్రజలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

అసంఘటిత కార్మికుల హక్కులను కాలరాసిన బీజేపీ ప్రభుత్వం

● ర్యాలీలో వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 16 : అసంఘటిత కార్మికుల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాసిందని దేశ సంపదను అంబానీ, ఆ దాని వంటి కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దోచిపెడుతోందని వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దేశవ్యాప్త సమ్మె నిరసన ర్యాలీలో భాగంగా శుక్రవారం వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు కడప పాత బస్టాండు నుంచి ఏడు రోడ్ల కూడలి, వన్‌టౌన్ మీదుగా బీఎస్ఎన్ఎల్ హెడ్‌పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు.అక్కడ ఏర్పాటు చేసిన ముగింపు సభలో వామపక్ష కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరిరెడ్డి, అన్వేష్, సుబ్బారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మిక, రైతాంగం, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ఒకవైపు పెట్రోలు, డీజలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి ప్రజల నెత్తిన భారం వేయడమే కాక వ్యవసాయ పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే దేశ సంపదను అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దోచిపెడుతోందన్నారు. కార్మికులు పోరాడి సాదించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. అంతేకాక భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారన్నారు. అందుకే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించి కూలి రూ.600 ఇవ్వాలన్నారు. కరవు తుఫాను నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలను రైతులకు వెంటనే ఇవ్వాలని, పంటల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించి స్మార్ట్‌మీటర్లు బిగించే విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. ఈ ర్యాలీ సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, గాలిచంద్ర పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి రామారావు, నాయకులు ఈశ్వరయ్య, నరసింహులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకర రవి, యువజన సంఘం నగర కార్యదర్శి ఓబులేసు పాల్గొన్నారు.


కడపలో ర్యాలీ చేపడుతున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

● దేశ సంపదను కార్పొరేట్‌కు కట్టబెడుతున్న బీజేపీ

వేంపల్లె, ఫిబ్రవరి 16: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పజెప్తూ దేశభక్తి పేరుతో దేశ సంపద మొత్తం కార్పొరేట్ సంస్థలకు బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతోందని పలువురు నాయకులు ధ్వజమెత్తారు. గ్రామీణ భారత్ సమ్మెలో భాగంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద శుక్రవారం వేంపల్లెలో నిరసన ధర్నా చేపట్టారు. కాంట్రాక్టు లేబర్ విధానం అన్నిరంగాల్లో పెంచి శ్రమదోపిడీకి గురిచేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వెంకటరామ్, సహాయ కార్యదర్శి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లెలో నిరసన తెలుపుతున్న పలు సంఘాల నాయకులు

రేపు విద్యాసాగర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 16 : కడప నగరం బాలాజీ నగర్ ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం ఉదయం 10గంటలకు విద్యాసాగర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రూల్ ఆఫ్ రోబోటిక్ టెక్నాలజీ ఇన్‌ఫ్యూచర్ అనేఅంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు విద్యాసాగర్‌రెడ్డి, గైనకాలజిస్ట్ శ్రీలక్ష్మి సంయుక్త శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు 6వతరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. వారికి సృజనాత్మకత ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి 11.30 వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ డ్రాయింగ్ పోటీల్లో పాల్గొనే వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని, అలాగే మొదటి బహుమతి రూ.7వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు ప్రోత్సాహక బహుమతులు ఐదు మందికి వెయ్యి చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన దలచిన విద్యార్థులు తమ పేర్లను 9441035961, 9966563492లకు ఫోను చేసి నమోదు చేసుకోవాలన్నారు. 17న రాత్రి 8గంటల్లోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

అన్నార్తుల ఆకలి తీర్చడం పుణ్యకార్యం

కడప (కల్చరల్), ఫిబ్రవరి 16: అన్నార్తుల ఆకలి తీర్చడం పుణ్యకార్యమని సమాజసేవకుడు ఉక్కాయపల్లె రాజా పేర్కొన్నారు. దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం శుక్రవారం ఆయన అన్నదానం చేశారు. ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు స్వామివారిని దర్శించుకునే భక్తులకు, పేదలకు, అన్నదానం చేశారు. స్వామివారి సేవలో తరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు రాజా పేర్కొన్నారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న ఉక్కాయపల్లె రాజా

ఎన్నికలకు సర్వం సిద్ధం: కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: సాధారణ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సాధారణ ఎన్నికల సన్నద్ధం ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీసీ ద్వారా సమీక్షించారు. ఆర్డీఓలు మధుసూదన్, శ్రీనివాసులు, కౌసరుబాను విజయకుమార్, వెంకట్రావు కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

అర్హులందరికీ పథకాలు అందాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న హౌసింగ్ పట్టాలు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ, చుక్కల భూములు,మూడవ దశ రీసర్వే, పంచాయితీ రాజ్ రబీ పంటలు, తాగు నీరు, కరువు మండలాల్లో వేజ్ జనరేషన్ వైద్య ఆరోగ్యం, జగనన్న ఆరోగ్యసురక్ష, ఆరోగ్యశ్రీ కార్డులు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డితో కలిసి కలెక్టర్లతో వర్చువల్ పద్ధతిలో సమీక్షించారు.

నిబంధనలు పాటించాలి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 16: ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలని ఎంవీఐ ప్రసాద్ అన్నారు. జాతీయ భద్రత 35వ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో గూడ్స్ వెహికల్ డ్రైవర్లు, ఓనర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారుడు తన వద్ద తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 16: ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలు బీజేపీకి బానిసలుగా తయారయ్యాయన్నారు. ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఆ ఊసే ఎత్తలేదన్నారు. దీనిపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు ప్రశ్నించలేవన్నారు. నాయకులు మనోహర్‌రెడ్డి, మదుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి

సీకేదిన్నె, ఫిబ్రవరి 16: విద్యార్థులు సేవా భావాన్ని కలిగి ఉండాలని స్టెప్ అధికారి పి.సుబ్బరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశంపల్లి లోని ఆశా నిలయంలో కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంప్ ముగింపు కార్యక్రమాన్ని ఆశా నిలయంలో ఏర్పాటు చేశారు. చెవిటి, మూగ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవతోపాటు వృద్ధులు, వికలాంగులకు కూడా సేవలను అందించడం అవసరమన్నారు. సమాజానికి సేవలు అందించడం ద్వారా మానసిక సంతృప్తి కలుగుతుందని, అదే విదంగా పెద్దల దీవెనలు పొందడంతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.చంద్రఓబుళరెడ్డి (నాని), ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఆశా నిలయంలో చెవిటి, మూగ పిల్లలకు స్వీట్లు అందిస్తున్న స్టెప్ అధికారి సుబ్బరాయుడు

దేవునికడప తిరుణాలలో అన్నదానం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 16 : దేవునికడప తిరుణాల సందర్భంగా పవన్ లక్ష్మీవెంకటేశ్వర టూర్స్ అండ్ ట్రావెల్స్ అండ్ కేటరింగ్ ఆధ్వర్యంలో పుత్తా ప్రవీణ్ కుమార్‌రెడ్డి 12వ జ్ఞాపకార్థం సందర్భంగా భక్తులకు అన్నదానం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎం కేశవకుమార్, ఎంఎం మురుగేశం, కదిరి ప్రసాద్, పుత్తా రామసుబ్బారెడ్డి, సులోచనమ్మ, పుత్తా పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న పవన్ లక్ష్మీవెంకటేశ్వర టూర్స్ అండ్ ట్రావెల్స్ అండ్ కేటరింగ్ యాజమాన్యం

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

సీకేదిన్నె, ఫిబ్రవరి 16:ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ అధికారి డాక్టర్ ఎస్.రవి తెలిపారు. శుక్రవారంకృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించడం అనే అంశంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని రెండవరోజు నిర్వహించారు. మామిళ్లపల్లె గ్రామంలో బాలాజీ అనే రైతు ప్రకృతి వ్యవసాయ పొలంలో ఆకుకూరలు, కషాయాల తయారీపై చూపించారు. కేవీకే సమన్వయకర్తలు, శాస్త్రవేత్తలు శిల్పకళ, సునీల్‌కుమార్, రామకృష్ణ, సాయిమహేశ్వరి, ప్రశాంతి, స్వామిచైతన్య, మహేష్‌బాబు, ప్రశాంతి, మానస, సురేష్, మాధవి, రైతులు పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులు భాగస్వామ్యంకావాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 16 : సమాజ సేవలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ పీఓ వి.రమాదేవి నేతృత్వంలో అలంఖాన్‌పల్లెలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో వీధుల్లోని మట్టి కుప్పలు, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా పీఓ రమాదేవి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

సూర్యనమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం

వేంపల్లె, ఫిబ్రవరి 16:నిత్యం సూర్య నమస్కారాలు, యోగా, వ్యాయామం సాధనం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్త అన్నారు. శుక్రవారం ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య నియమాలపై అవగాహన పెంచుకోవాలని, మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందన్న విషయాన్ని అందరు పరిగణలోకి తీసుకొని వ్యా యామం చేయలాని సూచించారు. ఓఎస్డీ గంగిరెడ్డి, ఏఓ రామ్‌భూపాల్‌రెడ్డి, డీఎన్ సీహెచ్ రత్నకుమారి, తదితర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19న వీరపునాయునిపల్లెలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 16: మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామంలో ఉన్న పట్టాభిరామ దేవస్థానంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు సీతారాముల నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 19న ఉదయం గోపూజ, గణపతి పూజ, స్వస్తి వాచనం తదితరపూజాదికార్యక్రమాలతో పాటు నవగ్రహారాధన, మంగళహారతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు పూజలు, హోమాలు అనంతరం విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

చెన్నూరు, ఫిబ్రవరి 16 : మండలంలోని గుర్రంపాడు గ్రామ పంచాయతీలో వ్యవసాయ పొలాల్లో తుప్పుబట్టి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకు మార్చివేశారు. రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రాణాలు పోతేగాని పట్టించుకోరా అన్న కథనం ప్రసారం కావడంతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు పాత స్తంభం తొలగించి దాని పక్కనే కొత్త స్తంభం ఏర్పాటు చేశారు.


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దికవాండ్లపల్లెలో నీటి ఎద్దడి

చక్రాయపేట, ఫిబ్రవరి 16: మండలంలోని మద్దికవాండ్లపల్లెలో నీటి ఎద్దడి ఏర్పడింది. వేసవి కాలం సమీపించడంతో బోర్లు అడుగంటి నీటి సమస్య ఏర్పడింది. గత వారం రోజులుగా నీటి కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల బోరులో దించడానికి అధికారులు పైపులు పంపారు. కానీ రెండు పైపులు మాత్రమే దిగాయని మిగిలిన పైపులు దిగలేదని, దీంతో సరిగా నీరు అందలేదన్నారు. నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోందని వారు తెలిపారు. వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లినప్పటికి అక్కడ కరెంటు కష్టాలు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణం స్పందించి నీరు అందించాలని విన్నవించారు.


నీటి కోసం ఎదురుచూస్తున్న జనం

వెంకటరమణారెడ్డి మృతదేహానికి పుత్తా నివాళి

చెన్నూరు, ఫిబ్రవరి 16 :శబరిమలైలో అయ్యప్ప దర్శనానికి వెళ్లి అక్కడే హఠాన్మరణం చెందిన చెన్నూరుకు చెందిన టీడీపీ నేత నేలటూరు వెంకటరమణారెడ్డి మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం చెన్నూరులోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. మృతదేహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. వెంకటరమణారెడ్డి సతీమణి, కుమారులను ఓదార్చారు. అలాగే మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి , మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు, బలిజ సంఘం జిల్లా నేత ప్రసాద్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, సాయి నరసింహారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 16: పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని ఆ సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, శివశంకర్, క్రిష్ణయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే అన్నదాతను రోడ్లపైకి తీసుకువచ్చి బాధపెట్టడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అంగీకరించిన విధంగా రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. గత కొన్నిరోజులుగా ఢిల్లీలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం, చర్చలు జరపకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. అలాగే విద్యుత్ సంస్థలో ట్రై పార్టీ అగ్రిమెంటు ప్రకారం ఒకే రకమైన సర్వీసు రెగ్యులేషన్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. విద్యుత్ సంస్కరణల వల్ల విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికుల వ్యవస్థ ఏర్పడిందని, శ్రమదోపిడీకి గురవుతున్నారని, వారందరికీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కేవీ సురేంద్రబాబు, సుబ్రమణ్యం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నాయకులు

కమనీయం శ్రీవారి కల్యాణం

చెన్నూరు, ఫిబ్రవరి 16 :రథసప్తమి పర్వదినం సందర్భంగా చెన్నూరు ప్రసన్న వెంకటేశ్వర స్వామి (కోట్లస్వామి), సరస్వతీనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరుడి కల్యాణం కన్నులపండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అభిజిత్ లగ్నమందు ఉదయం 9 నుంచి 12 వ రకు కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా రామదాసు భక్తబృందంచే భజనలు, వేదసంస్కృత కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 2 నుంచి గ్రామంలో వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ గ్రామోత్సవంలో కోలాటాలు, చెక్కభజన, ఇతర సాంసస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కడప డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్ వెన్నులో వణుకు

● కడప టీడీపీ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 16 : రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్ వెన్నులో వణుకు పుట్టిందని కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనకు హైకోర్టు అనుమతినివ్వడం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. రాజధాని సినిమా అంటేనే సీఎంకు ఓటమి భయం పట్టుకుందన్నారు. 34వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవరూపం ఈ సినిమా అన్నారు. మూడు ప్రాంతాల పేరుతో రాష్ట్రాన్ని విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని జగన్ కుట్రలు పన్నారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని నిలబెట్టిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని మాధవీరెడ్డి పేర్కొన్నారు.

సినిమాను సీఎం అడ్డుకోవడం దారుణం

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకోవడం దారుణమని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్ రెడ్డికి వచ్చిన నష్టం ఏంటో చెప్పాలన్నారు.

'రాజధాని సినిమాతో భయమెందుకు?'

అమరావతి రాజధాని సినిమాతో ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు జరిగిన అన్యాయంపై రాజధాని ఫైల్స్ సిని మా చేస్తే ప్రభుత్వం అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

● ఎమ్మెల్సీకి రూటా వినతి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 16 : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను 2024 డీ ఎస్సీ ద్వారా భర్తీ చే యాలని రూటా వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర సమన్వయకర్త మహ్మద్ ఆయూబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎంవీ రా మచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేసి ఉర్దూ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. రూటా ప్రతినిధులు వలీవుల్లా, హకీం, ఫక్రుద్దీన్, మహ్మద్ ఇర్షాద్, జాకీర్‌ఉసేన్, షాబుద్దీన్, అలీ అక్బర్, ఖాజాపీర్, షైనుద్దీన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 16 :ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలను పరిష్క రించాలని శుక్రవారం తూ ర్పు రాయలసీమ ఉపాధ్యా య ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అ ధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా క్రిష్ణయ్య, ఎంఎం గిరిప్రసాద్‌లు తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 సెప్టెంబరు కంటే ముందే నోటిఫికేషన్ విడుదలై ఆ తరువాత నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ కోర్టు తీర్పుకనుగునంగా పాత పింఛన్ విధానం వర్తింపజేయాలని కోరినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, ఫిబ్రవరి 16: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రవీణ్‌కుమార్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 220 కేవీ చక్రాయపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

తెలుగుదేశం పార్టీలోకి వలసల పరంపర

అట్లూరు, ఫిబ్రవరి 16 : అట్లూరు మండలం ముత్తుకూరు పంచాయతీ పరిధిలోని బోడిశెట్టిపల్లె, చలంగారిపల్లె, చౌటుపల్లె గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు బద్వేలు మాజీ ఎమ్మెల్యేవిజయమ్మ, యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి సమక్షంలో 150 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ మండల నాయకులు బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, మంచూరి సూర్యనారాయణరెడ్డి, పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి, పాలకొండు రామచంద్రరెడ్డి, కడప పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షురాలు సుధారాణి, అరవశ్రీనివాసులురెడ్డి, పొన్నవోలు సులోచన, బొమ్మిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, పోలుబోయిన కుప్పయ్య ఆధ్వర్యంలో మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్ సాహెబ్‌బాషా, మాజీ సర్పంచ్ రాజేశ్వరి, వార్డుమెంబర్లు బ్రహ్మయ్య, సుబ్బారావుతో పాటు 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేవిజయమ్మతో పాటు యువనేత రితీష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, చలమారెడ్డి, సూరారెడ్డి, బ్రహ్మయ్య, ఎర్రపురెడ్డి పోతిరెడ్డి, రెడ్డయ్య, అమర్‌నాథరెడ్డి, క్రిష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చింతవాళ్లపల్లె నరసింహారెడ్డి, పాటూరు రాధాక్రిష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెదరామసుబ్బారెడ్డి, మద్దికపుల్లారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, గురు ప్రసాద్, గోపాల్‌రెడ్డి, చిన్నరామసుబ్బారెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, శివయ్యస్వామి పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: ప్రతి ఒక్కరూ రాష్ట్ర భవిష్యత్తుకోసం సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి శుక్రవారం ప్రజలను అభ్యర్థించారు. అందులో భాగంగా కొండాపురం మండలం కె.సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన పది కుటుంబాలవారు జమ్మలమడుగు టీడీపీ కార్యాలయం చేరుకుని ఆ పార్టీలో చేరిపోయారు. వారికి భూపేశ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో రఘునాథరెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, పవన్, ఆదినారాయణరెడ్డి, బాబురెడ్డి, ఈశ్వరరెడ్డి, మాధవరెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: రెడ్డికొట్టాల గ్రామంలో శుక్రవారం వైసీపీకి చెందిన మొగల్‌ఉస్సేన్‌బేగ్, గొడుగునూరు సుబ్బయ్య, పోరుమామిళ్ళ నరసింహులు,పి.సిద్దయ్య,పి.విలియం.పి.బాబు తదితర 30 కుటుంబాలకు చెందిన వారు డీటీపీలో చేరారు. బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ వీరందరికీ పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, రెడ్డికొట్టాల మాజీసర్పంచ్ ఓ.మాధవి,టీడీపీ జిల్లా కార్యదర్శి మురళీ, టీడీపీ నాయకులు హోండా రవీంద్రారెడ్డి,లక్కిరెడ్డి శ్రీనివాసులరెడ్డి,దిన్నెపు క్రిష్ణారెడ్డి,ఓ.రోహిత్‌రెడ్డి,బి.నరసింహారెడ్డిఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




అట్లూరు... ముతుకూరు పంచాయతీలో విజయమ్మ, రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన 150 కుటుంబాలు, జమ్మలమడుగులో భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరినవారు

కుడా చైర్మన్ సోదరులు వైసీపీ నుంచి టీడీపీలోకి..

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 16 : రాబోవు ఎన్నికల్లో బద్వేలులో టీడీపీ విజయదుందుభి మోగిస్తుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లరోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో కుడా ఛైర్మన్ గురుమోహన్ సోదరులు సింగసాని విజయకుమార్, సింగసాని గురురాజా వారిరువురి సమక్షంలో సుమారు 200 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు వచ్చాయి. దీంతో బద్వేలులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ నుంచి టీడీపీలోకి సింగసాని విజయకుమార్, గురురాజా, కేశవయ్య, చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, సింగసాని రామ్మోహన్, షేక్ చాంద్‌బాషా, దాదావీర్, సయ్యద్ వహీరా, మల్లికార్జున, రామస్వామి సోదరులు బాలనరసింహుడు, వెంకటేశ్వర్లు, కొరపాటి సురేంద్ర, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, బాసికాల శ్రీను, సింగంశెట్టి రమణ తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, జహంగీర్‌బాషా, బిగ్‌బాస్, నరసింహనాయుడు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పేరు వింటే జగన్‌కు భయం : భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 16: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రాజధాని అమరావతి పేరు వింటేనే భయం భయంగా ఉందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలను కళ్లకు కట్టినట్లు చూపించిన రాజధాని ఫైల్స్ అనే సినిమా ప్రదర్శనను నిలిపివేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజు, లక్షుమయ్య, నాగార్జున, మునిస్వామి, రాజారెడ్డి, గంగాధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బయ్య, రాజేష్, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'సినిమా ప్రదర్శన అడ్డుకోవడం పిరికిపంద చర్య'

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 16 : రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను సీఎం జగన్ అడ్డుకోవడం పిరికిపంద చర్య అని బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విపక్షంలో ఉన్నప్పుడు రాజధాని ఏర్పాటుకు స్వాగతిస్తున్నామని అసెంబ్లీసాక్షిగా చెప్పిన జగన్ అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో డ్రామాలాడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సామాజిక బాధ్యతతో వాస్తవాలను సినిమా తీస్తే తప్పు ఎలా అవుతుందన్నారు. వైఎస్ జగన్ చేసిందే వారు చూపించారని, దానికి ఉలిక్కిపడడం ఎందుకన్నారు. టీడీపీ, జనసేన కూటమి విజయం సాధిస్తుందన్నారు.

ఇంటింటి కుళాయిలను ప్రారంభించిన పుట్టా

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 16 : బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట్ల గ్రామ పంచాయతీ డి.అగ్రహారం గ్రామంలో టీడీపీ నాయకులు కాణాల మల్లికార్జునరెడ్డి, రామచంద్రారెడ్డి , మాధవరెడ్డి వెంకటేశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి రూ.10 లక్షల వ్యయం సొంత నిధులతో నూతన బోరు వేయించి మోటారు బిగించి ఇంటింటికీ పైపులైను కనెక్షన్ ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ చేతుల మీదుగా కుళాయిలు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, బి.మఠం క్లస్టరు ఇన్‌ఛార్జ్ వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ మాలేపాటి సుబ్బారావు, కాణాల మల్లికార్జునరెడ్డి, వెంటరమణారెడ్డి, మాధవరెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, వెంకటేశ్, నాగేంద్ర, ఓబయ్య, అమరావతి వెంకటసుబ్బయ్యళ్ళ, పెరుగు నాగేశ్, సాంబయ్య, ఓబులేసు, రంగయ్య, భీమయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్యాయాలపై గళం విప్పేందుకే బీసీల ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న బొర్రా రామాంజనేయులు

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 16 : బీసీలకు స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలపై గళం విప్పేందుకు ఆత్మగౌరవ సభ తల పెట్టామని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం బీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 1956నుంచి ఎంపీ ఒక్కకులంవారే వుంటున్నారన్నారు. ప్రొద్దుటూరులో కూడా ఇప్పటి వరకు ఒక్క కులం వారే ఎమ్మెల్యేలుగా వుంటున్నారన్నారు. ఇప్పటికైనా సమాజంలో సగభాగంపైన వున్న బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు ఇచ్చి రాజ్యాధికారంలో భాగం చేయకపోతే ఇక్కడ సామాజిక విప్లవానికి దారితీస్తుందన్నారు.బీసీల ఆత్మగౌరవం నిలబెట్టడంకోసం ఫిబ్రవరి 18 ఆదివారం ప్రొద్దుటూరు టీటీడీ కల్యాణ మండపంలో భారీబహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో బీసీ నేతలు ప్రజా ప్రతినిధులు ఈ సభకు హాజరవుతారన్నారు.ఈ సభకు బీసీందరూ భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘం నేతలు జింకా మార్కెండేయులు, సంటెన్న ,ఆదినారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 16 : మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంటు సలహాదారుడు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆరోగ్యకేంద్రం తనిఖీ చేశారు. వైద్యాన్ని ప్రజలకు బాగా అందించాలని అన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



ప్రొద్దుటూరులో పుష్పాలంకరణలో భూదేవి, శ్రీదేవి సమేత చెన్నకేశవస్వామి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 16: పాత మార్కెట్‌లోని మహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు, శ్రీదేవి, భూదేవి సమితే చెన్నకేశవ స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజించారు. సాయంత్రం గోవింద నామస్మరణలతో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

పోరుమామిళ్ల..: రథసప్తమి వేడుకలు పోరుమామిళ్లలో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ఆలయ కమిటీ అధ్యక్షుడు తులసి సురేష్‌బాబు ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

బద్వేలు టౌన్..: పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఫైర్ స్టేషన్ వెనుక భాగంలో మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సూర్యప్రభ వాహనం, శేష వాహనం, హనుమంతవాహనం, గరుడ వాహనం, చంద్రప్రభ వాహనం, గజవాహనం, అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం నిర్వహించారు.

బద్వేలు రూరల్..: మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలోని లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో సూర్య ప్రభ వాహనంపై శ్రీనివాసుడు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం గ్రామ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలోహాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కాశినాయన..: నర్సాపురంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామివారు ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ,శేష, గరుడ,హనుమంత,గజ,కల్పవృక్ష,చంద్రప్రభ వాహనాల్లో ఊరేగారు. ఈసందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. సప్తవాహనాల్లో స్వామివారి గ్రామోత్సవం కన్నులపండుగగా సాగింది.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన

జమ్మలమడుగు, ఫిబ్రవరి 16: జమ్మలమడుగు ఏపీజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట, పెద్దదండ్లూరు సచివాలయం వద్ద శుక్రవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో ప్రభుత్వంపై వివిధ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మూడో రోజు నిరసన తెలుపుతున్నట్లు జేఏసీ అధ్యక్షుడు పోరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఓబులేసు, ఫార్మసిస్టు సుబ్బరాయుడు, ల్యాబ్‌టెక్నీషియన్ జీవన్, ప్రభావతి, నర్సింగ్ సిబ్బంది , ఆరోగ్యశ్రీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులతో వేధింపులు తగదు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై, వారి విధానాలను ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా అక్రమ కేసులు బనాయించి తీవ్ర వేధింపులు తగదని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలో నరేంద్రమోదీ పరిపాలన వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ స్టేట్‌బ్యాంకు ఎదురుగా, ఎల్ఐసీ, స్టేట్‌బ్యాంకు తదితర కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు.సీఐటీయూ నాయకులు దాసరి విజయ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వం రైతులు సాగు చేసే పంటలకు మద్దతు ధర ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం దేశ వ్యాప్తం సమ్మెలో భాగంగా స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరి, యేసోబ్, గురుమూర్తి, ప్రమీల, సృజన శ్రీను, నాగేంద్ర, ప్రేమ్, హరిత, విజయకుమార్ పాల్గొన్నారు.

విజయవంతమైన సైన్స్ కళాజాతా

బద్వేలు, ఫిబ్రవరి 16: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలలో నిర్వహించిన సైన్స్ కళాజాత విజయవంతమైంది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి మూఢ విశ్వాసాల వలన సమాజానికి జరిగే నష్టాలను వివరించారు. రాష్ట్ర నాయకులు మురళీధర్ మాట్లాడుతూ ప్రశ్నించడం ద్వారానే సమాజం మార్పు చెందుతుందని తెలియజేశారు. అనంతరం మ్యాజిక్ ప్రదర్శన , గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ గోపాల క్రిష్ణయ్య, హరికిరణ్, జే.వి.వి. జిల్లా గౌరవ సలహాదారు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి బాల బయయన్న , జేవి.వి. రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మాదన విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించి పనులు చేయాలి

మైదుకూరు, ఫిబ్రవరి 16 : బైపాస్‌రోడ్డు నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించి పనులు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రొద్దుటూరు, బద్వేల్ రోడ్డు బైపాస్ పనులు చేస్తున్నారు. అయితే భూములు కోల్పోయిన వారిలో కొంత మందికి నష్టపరిహారం చెల్లించగా, మరి కొందరికి చెల్లించలేదు. అయితే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం వేగంగా నిర్వహిస్తున్నారు. అయితే నష్టపరిహారం అందని కొందరు రైతులు జిల్లా రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ రైతులతో కలసి శుక్రవారం పనులను అడ్డుకున్నారు. దీంతో పనులు చేపడుతున్న వారు అధికారుల దృష్టికి తీసుకపోవడంతో వీఆర్వో అబ్బాస్ అక్కడికి చేరుకొని రైతులతో సంప్రదించారు. నష్టపరిహారం అందని రైతుల జాబితాను కలెక్టర్‌కు పంపుతామని తెలిపారు. 20వ తేదీ లోపు నష్టపరిహారం అందక పోతే తిరిగి పనులు అడ్డుకుంటామని రైతులు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 16 : మండలంలోని శీనప్పబావివీధిలోఉన్నమెయిన్ బోరు చెడిపోవడంతో పట్టణ ప్రజలకు నీటి సరఫరా నిలిచింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ యనమల సుధాకర్ వెంటనే స్పందించి యంత్రం సహాయంతో సమస్యను పరిష్కరించారు. పంచాయతీలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తిన తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

విష ఆహారం తిని 11 మేకలు మృతి

మైదుకూరు, ఫిబ్రవరి 16 : ఆహారం కోసం వెళ్లిన మేకలు విషాహారం తిని 11 మేకలు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం మున్సిపల్ పరిధిలోని శెట్టివారిపల్లె సమీపంలోని ముక్కొండలో జరిగింది. శుట్టివారిపల్లెకు చెందిన మద్దూరు దస్తగిరి మేకలు పోషించుకుంటూ జీవనం గడిపేవాడు. మేత కోసం వాటిని స్థానిక ముక్కొండకు తీసుకెళ్లగా అక్కడ విషాహారం తిని మృతి చెందినట్లు ఆయన తెలిపారు. వాటి విలువ దాదాపు లక్ష రూపాయలు పైగా ఉంటాయని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలి

ముద్దనూరు ఫిబ్రవరి16:ఎన్నికల సమయంలో ఎటువంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పార్టీల నాయకులకు సీఐ దస్తగిరి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పార్టీల నాయకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫ్లెక్సీలను గ్రామ సచివాలయ అధికారుల అనుమతితో ఏర్పాటు చేసుకోవాలన్నారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

మోదీ పాలనలో కార్మికులకు తీరని అన్యాయం



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

మైదుకూరు, ఫిబ్రవరి 16 : దేశ వ్యాప్తంగా కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో భాగంగా సీపీఐ, సీపీఎం సంయుక్త అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మైదుకూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టిశ్రీరాముల సర్కిల్ నుంచి రాయల్ సర్కిల్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ పాలనలో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, భాస్కర్, శ్రీరాములు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ, సీఐటీయూసీ, కార్మిక రైతు వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ భారత్‌బంద్‌లోభాగంగా మోదీ శవయాత్ర కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరుమామిళ్ల అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు మోదీ శవయాత్ర నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ ,అఖిలపక్షం నాయకులు రవికుమార్, పీరయ్య, వెంకటేశ్వర్లు, రవీంద్ర, చిన్నయ్య, సుందరం, రవి, లూర్దుమేరీ, బీబీ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం..: గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం కొండాపురంలో బైపాస్‌రోడ్డులో వామపక్ష రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు,కార్మికులను మోసగిస్తూ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధంగా అవలింభిస్తున్న విధానాలను వ్యతిరేకేస్తూ రాస్తారోకో చేపట్టడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి, వైవి సుదర్శన్‌రెడ్డి, మనోహర్‌బాబు, రైతులు,కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభంజనంలో వైసీపీ గల్లంతే





ప్రొద్దుటూరు, ఖాజీపేట, పోరుమామిళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, బొజ్జ రోశన్న

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 16 : టీడీపీ ప్రభంజనంలో వైసీపీ గల్లంతు కానున్నదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 27 వార్డు వసంత పేట రామేశ్వరంలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జబీవుల్లా, మహిళా అధ్యక్షురాలు బోగాల లక్ష్మీనారాయణమ్మ, సీతారామిరెడ్డి, బాబుల్ రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, వార్డు ఇన్‌చార్జులు లక్ష్మీదేవి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు : పుట్టా

ఖాజీపేట, ఫిబ్రవరి 16: టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆంజనేయకొట్టాలు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి మినీ మేనిఫేస్టేను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, ఏరువ పాపిరెడ్డి, రావుల వెంకారెడ్డి, రావుల వెంకటేశ్వరరెడ్డి, ఫరూక్, పీరయ్య, సుబ్బయ్య, పాపన మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, జిలానీబాష, షఫి, బండి వెంకటేషు, రామానాయుడు, పిచ్చినాయుడు, రామసుబ్బయ్య, కొత్తపేట బుజ్జి, కోకల వెంకటసుబ్బారెడ్డి, దుంపలగట్టు రవి, కిశోర్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలను వివరిస్తూ ఆ కరపత్రాలను బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న పంపిణీ చేశారు. శుక్రవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో వెంగమాంబనగర్, సుందరయ్యకాలనీ ప్రాంతాల్లో టీడీపీ మేనిఫెస్టోలో ఆరు పథకాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో సైకిలు గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. ఎంపీటీసీ కల్వకూరి రమణ, టీడీపీ నాయకులు సీతావెంకటసుబ్బయ్య, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, కల్వకూరి రమేష్, సంచర్లమాజీ సర్పంచ్ సోమిరెడ్డి, డ్రైవరు ఎస్ఎంబాషా, పుల్లప్పనాయుడు, అన్వర్ పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర భవిష్యత్తు పరుగులు పెడుతుందని బొజ్జ అరుణ, నియోజకర్గ మహిళా అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోనసముద్రం, జోగిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బిజివేముల రామచంద్రారెడ్డి, మహేంద్రరెడ్డి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, వైశాలి రామచంద్రరెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కొరివి సాంబశివారెడ్డి, పోకల నారాయణ, విశ్వనాధరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, మూర ప్రసాద్, తమటం వెంకటయ్య, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

మైలవరం..: రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి దేవగుడి సరస్వతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామచంద్రాయపల్లి, మద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు, అంకాలు, వెంకటకృష్ణ, నాగార్జున, గంగరాజు, బాలి, దాసి, సుబ్బయ్య, ఓబులేసు, అశోక్, రాజేష్, బాబు, సుబ్బరాయుడు, వెంకటన్న, శ్రీను, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో ప్రచారం చేస్తున్న సరస్వతి,జ్యోతి



బద్వేలులో ప్రచారం చేస్తున్న అరుణ, లక్ష్మీదేవి